క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు (శనివారం) పర్యటిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణపురం, ఏదులాపురం, గొల్లగూడెం, బారుగూడెం, కొండాపురం, తల్లంపాడు, పొన్నేకల్, మద్దులపల్లి, తెల్దారుపల్లి, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల, సంధ్యాతండా, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్‌గృహకల్పల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పర్యటించనున్నట్లు చెప్పారు.

ముగిసిన టీ.టీ. శిక్షణ శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ హాజరై మాట్లాడుతూ.. నెల రోజుల పాటు పొందిన శిక్షణను సరైన జాగ్రత్తలు పాటించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శి లేటి సాంబమూర్తి, కొండ శ్రీధర్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఎంజీవీ ప్రవీణ్, ఉపేందర్, రామచందర్, కామేశ్వరీ, జోజిచాకో, రెడ్డి సాయి శివ, పి.చలపతి, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం 25వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సానుభూతి పరురాలు ఉదారు రంగమ్మ మృతికి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు వడ్డెబోయిన నర్సింహారావు సంతాపం తెలిపారు. శుక్రవారం పాకబండబజార్‌లోని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట డివిజన్ అధ్యక్షుడు దాసరిపూర్ణ, నాయకులు బండారు శ్రీనివాస్, చల్లా మోహన్‌రావు, పాండు, గార్ల వెంకన్న, బొడ్డు మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం : ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు జన్మదిన వేడుకలను మండలంలోని పిండిప్రోలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పరికపల్లి చంద్రశేఖర్, ఎంపీటీసీ పులిగుజ్జు వెంకటేశ్వర్లు, నాయకులు పసలాది ముత్తయ్య, తాతా రవీందర్, చామకూర వెంకట్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లాజిస్టిక్స్ కేంద్రాలను వినియోగించుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ కేంద్రాలను వినియోగించుకోవాలని ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ వి.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని కరుణగిరి, బోనకల్‌లో రెండు లాజిస్టిక్ కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వీటిని ప్రారంభించినందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరుణగిరి ఏజెంట్ సాయి కిరణ్, బోనకల్ ఏజెంట్ మాధవరావు, రామ కోటేశ్వరరావు, ఖమ్మం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణానికి అలైన్‌మెంట్ సర్వే..

ఖమ్మంఅర్బన్: నగరంలోని మున్నేరుకు ఇరువైపుల దానవాయిగూడెం నుంచి బైపాస్ రోడ్డు, ప్రకాశ్‌నగర్ వంతెన వరకు చేపట్టాల్సిన కరకట్ట నిర్మాణ పనులకు సంబంధించిన ఫైనల్ అలైన్‌మెంట్ సర్వేను శుక్రవారం జల వనరుల శాఖ సీఈ కె.విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగరావులు పరిశీలించారు. ప్రస్తుతానికి భూసేకరణ లేనిప్రాంతంలో పనులు మొదలు పెట్టారు. భూసేకరణ చేయాల్సిన ప్రాంతాలు, అక్కడ చేపట్టాల్సిన పనులను మ్యాప్ ఆధారంగా సీఈకి వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఈ పుచ్చకాయల ధన్‌కుమార్‌రెడ్డి, ఈఈలు మంగళపుడి వెంకటేశ్వర్లు, అనన్య, డీఈలు ఉదయ్‌ప్రతాప్, బాణాల రమేష్, ఏఈలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామపంచాయతీలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాపటపల్లి ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా.. దేవాలయ కమిటీ ఆధ్వర్యాన తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


జనరేటర్ చుట్టూ చేరిన మురుగు నీరు


మురుగు నీటి కోసం తాత్కాలికంగా తవ్విన గుంత


భవనం గోడల పైనుంచి లీకవుతున్న మురుగు నీరు

పెద్దాస్పత్రిలో లీకులు..!

ఎంసీహెచ్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

- బయటకు ఉబికి వస్తున్న డ్రెయినేజీ మురుగు నీరు
- పైపుల లీకేజీలతో కంపుకొడుతున్న పరిసరాలు
- భవనం నిర్మాణ లోపంతో రోగుల అవస్థలు
- ఆధునికీకరణకు నిధులు కరువు
- శాశ్వత పరిష్కారం చూపాలని పలువురి వేడుకోలు


ఎంసీహెచ్ ఆవరణలో ఉబికి వచ్చిన మురుగు నీరు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య (ఎంసీహెచ్) కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మురుగు నీరు బయటకు ఉబికి వస్తుండడంతో పరిసరాలు మురికి కూపంగా మారుతోంది. చాలా కాలంగా ఈ సమస్య వేధిస్తున్నా.. ఆధునికీకరణ పనులకు నిధులు కేటాయించకపోవడం రోగుల పాలిట శాపంగా మారింది. పైపుల నుంచి వచ్చే లీకేజీలు, అండర్ గ్రౌండ్‌లోని పైపుల నుంచి వచ్చే మురుగునీటితో ఎంసీహెచ్ పరిసరాలు అధ్వానంగా తయారవుతోంది. పారిశుద్ధ్య కార్మికులు తాత్కాలికంగా వాటిని తొలగిస్తున్నా.. సమస్య మాత్రం నిత్యకృత్యమవుతోంది. మురికి వ్యర్థాలు, దుర్గంధం నడుమ రోగులు ఆస్పత్రికి వైద్య సేవల కోసం రావాల్సి వస్తోంది.

పరిశుభ్రతలో వెనుకడుగు..

ఇంత వరకు బాగానే ఉన్నా ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుకునే విషయంలో మాత్రం వెనుకబడిపోయింది. భవనం నిర్మించిన సమయాన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ సరిగా నిర్మించకపోవడం వల్ల మురుగు నీరు బయటకు వెళ్లడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. డ్రెయినేజీ పైపులైన్ సరిగా లేకపోవడం వల్లే మురుగునీరు ఉబికి వస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు. అలాగే, చాలా చోట్ల పైఅంతస్తుల నుంచి మురుగు నీరు పైపుల గుండా బయటకు లీకవుతోంది. దీంతో ఆస్పత్రి ప్రవేశం వద్ద కూడా మురుగు నీరు నిత్యం జాలు వారుతోంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీల నుంచి ఉబికి వస్తున్న మురుగు నీరు ఆస్పత్రి ఎదుట ఉండే జనరేటర్ వద్దకు కూడా చేరుతున్నాయి. తాత్కాలికంగా అధికారుల ఆదేశంతో మురుగునీటి నిల్వ కోసం ఒక గుంత కూడా తవ్వారు. బయటకు ఉబికి వచ్చే మురుగునీరు ఆ గుంటలో చేరి మరింత దుర్గంధానికి కారణమవుతోంది. అంతే కాకుండా జనరేటర్ చుట్టూ మురుగు నీరు చేరుతుండడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యి ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఆస్పత్రికి గర్భిణులతో పాటు చిన్నారులు వస్తుండడంతో పారిశుద్ధ్య లోపం వారికి శాపంలా మారింది. వీరు ఎక్కువగా ఇన్‌ఫెక్షన్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉండడంతో పాటు ఆస్పత్రి ఆవరణలో వస్తున్న దుర్గంధం మూలంగా వాసన పీల్చి కొందరు ఇతర రోగాల బారిన పడుతున్నారు. ఇలా చాలా కాలంగా ఈ సమస్య ఉన్నా.. అధికారులు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించట్లేదు.

రాష్ట్రస్థాయిలో గుర్తింపు..

పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని 2018లో అందుబాటులోకి తీసుకొచ్చారు. చిన్నారులు, మహిళలు, గర్భిణులు, బాలింతల కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో 150 పడకలు అందుబాటులో ఉన్నాయి. కాగా, గత ఆరేళ్ల కాలంలో రోగుల తాకిడి మరింతగా పెరగడంతో వైద్య సేవలకు ఏ మాత్రం సరిపోవట్లేదు. దీంతో అధికారులు ఆస్పత్రి స్థాయిని మరో 100 పడకలకు పెంచాలని ఉన్నతాధికారులకు నివేదికలు సైతం పంపారు. అయితే ఎంసీహెచ్‌కు ఉమ్మడి జిల్లా నుండే కాకుండా సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలు, సరిహద్దు రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తుంటారు. ముఖ్యంగా భారీగా ప్రసవాలు జరుగుతుండడంతో రాష్ట్రస్థాయిలో మంచిపేరు కూడా సంపాదించింది.

కోడ్ ముగియగానే పనులు ప్రారంభిస్తాం..



మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలో లభిస్తుంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థలో లోపం వల్ల మురుగు నీరు బయటకు ఉబికి వస్తుంది. అలాగే పలు చోట్ల పైపుల నుంచి కూడా లీకులు ఎక్కువయ్యాయి. వాటి గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతుల కోసం రూ. 32 లక్షలు ఎస్టిమేషన్ వేశారు. కోడ్ ముగియగానే నిధులు మంజూరవుతాయి. వెంటనే పనులు ప్రారంభించి సమస్యకు శాశ్వతంగా చెక్ పెడతాం.

– డాక్టర్ బాబు రత్నాకర్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

ఖమ్మం సహకారనగర్: నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యాన ఉపాధ్యాయులంతా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలను మరింతగా బలోపేతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం నగరంలోని న్యూవిజన్ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యాన లీవ్‌రూల్స్, పెన్షన్‌రూల్స్, సంఘం నిర్మాణం, సంఘం బలోపేతంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులంతా విద్యార్థులు ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలను వివరించి బడిలో చేర్పించేలా చేయాలన్నారు. జూన్ రెండో వారంలోనే ఉపాధ్యాయ ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ విడుదల అవుతుందని, ఈ షెడ్యూల్‌లోనే పండిట్, పీఈటీ అప్‌గ్రేడేషన్ పూర్తవుతుందన్నారు. టెట్ లేకుండానే ప్రమోషన్స్‌కు అవకాశం కల్పించేలా ప్రాతినిధ్యం చేశామన్నారు. కాగా, సంఘ సీనియర్ నాయకులు వెంకటనర్సయ్య, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు మోత్కురి మధు, జిల్లా బాధ్యులు విజయ్ అమృత్‌కుమార్, పాపారావు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, న్యూ విజన్ విద్యాసంస్థల అధినేత సీహెచ్.జీకే ప్రసాద్, పీఆర్‌టీయూ నాయకులు ఆర్.బ్రహ్మరెడ్డి, కట్టా శేఖర్, జి.సుజాత, భారతి, పుట్లూరి వెంకటేశ్వరరెడ్డి, హుస్సేన్, రెబ్బా శ్రీను,డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరువు ఆక్రమణ తొలగింపులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువులో జరిగిన ఆక్రమణ తొలిగింపు పనులను ఇరిగేషన్ అధికారులు గత రెండు రోజులుగా శరవేగంగా చేపట్టారు. చెరువుమాదారం చెరువును మంగాపురం, బైరవునిపల్లి, చెరువుమాదారం గ్రామాలకు చెందిన పలువురు ఆక్రమిస్తున్నారని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం సభ్యులు ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. చెరువును ఆక్రమించి జేసీబీతో కట్టలను చెడగొట్టి మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. చెరువుమాదారం చెరువును ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, ఏఈ నరేష్‌లు సందర్శించి ఆక్రమించిన చెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామినారాయణ పాఠశాలకు 15 ఎకరాల స్థలం..

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలకేంద్రంలో స్వామినారాయణ ఇంటర్నేషనల్ గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. ఈ మేరకు స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ భూమి కేటాయించినందుకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రఘునాథపాలెం రెవెన్యూలోని సర్వే నంబర్ 21, 22, 30లో మొత్తం 15 ఎకరాల భూమిని పాఠశాల నిర్వహణ కోసం ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే చేసి గుర్తించి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం కేటాయించింది. స్వామి నారాయణ పాఠశాలకు రఘునాథపాలెం నుంచి జింకలతండా రోడ్డులోని గుట్టపై మట్టి తవ్వకాలు చేసి రాజకీయంగా వార్తల్లో నిలిచిన ప్రాంతంలో భూమిని పాఠశాల కోసం కేటాయించారు.

పశువులకు మేత ఏర్పాటు

కామేపల్లి: రెండు డీసీఎం వాహనాల్లో అక్రమంగా గోవులను హైదరాబాద్ వైపు తరలిస్తుండగా.. తిరుమలయపాలెం వద్ద పోలీసులు పట్టుకుని కామేపల్లి మండలం కొమ్మినేపల్లి జీపీ పరిధిలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల సంత ఆవరణంలోని షెడ్‌లకు తరలించారు. రెండు డీసీఎంలో సుమారుగా 130 గోవులను ఎక్కించడంతో ఒక ఆవు చనిపోగా.. మరో మూడు గోవులు తీవ్ర అస్వస్థకు గురయ్యాయి. మేత లేక అల్లాడుతున్న గోవులకు ఎంపీడీఓ రవీందర్, కార్యదర్శి నెహ్రూ ఆధ్వర్యాన పర్యవేక్షణ చేయడంతో పాటు వాటికి వరిగడ్డి, తాగు నీటిని ఏర్పాటు చేశారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థి ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: ఐసీటీ అకాడమీ, బహుళ జాతి సాఫ్ట్‌వేర్ కంపెనీ సర్వీస్ నౌ సంయుక్తంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షలో తమ కళాశాల విద్యార్థి ఎంవీఎస్ ప్రభు ప్రతిభ కనబర్చి రెండు సర్టిఫికెట్లు సాధించాడని చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈమేరకు శుక్రవారం విద్యార్థిని అభినందించారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా వార్షిక ఆదాయం రూ.16 లక్షల నుంచి రూ.48 లక్షల వరకు అందుకునే అవకాశాన్ని ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆరోగ్యాన్ని వెలిగించండి.. పొగను చల్లార్చండి', 'ధూమపానం వద్దు.. ఆరోగ్యమైన జీవితమే ముద్దు'అంటూ నినాదాలు చేశారు. అనంతరం పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశాక.. పొగాకు తీసుకోవడం వలన వచ్చే దుష్పరిణామాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌సీ డాక్టర్ కృపా ఉషశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ డాక్టర్లు బొల్లికొండ శ్రీనివాసరావు, రామారావు, ప్రదీప్‌రెడ్డి, నాగేశ్వరరావు, ప్రవీన్, స్వరూపరాణి, సరిత, అనంతలక్ష్మి, వైష్ణవి, రేష్మ, వినయ్, హెచ్ఈఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు

స్వర్గీయ సూపర్‌స్టార్, సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ 81వ జయంతి వేడుకలను సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ సేన ఆధ్వర్యాన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు, అన్నదానం నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేస్తున్న అభిమాన సంఘం నాయకులు

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

ఖమ్మంరూరల్: విత్తనాలు కొనుగోలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరేకోడుతండా, తనగంపాడు గ్రామాల్లో రైతులతో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామాల్లో లూజ్ ప్యాకెట్లు, గుడ్డ సంచులలో బిల్లులు లేకుండా అమ్మితే అట్టి విత్తనాలను తీసుకోకుండా.. వెంటనే వ్యయసాయాధికారులు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తీసుకున్న బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. విత్తనం తయారీ తేదీ, ఎక్స్‌పైరీ సమయం, లాట్ నంబర్ వంటివి తప్పకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ వి.నాగేశ్వరరావు, ఏఈఓలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో పని చేస్తే గుర్తింపు


బలరాంనాయక్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

కామేపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో పని చేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న నురుగుల బలరాంశంకర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం రైతు వేదికలో నిర్వహించగా.. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. 38 ఏళ్లుగా బలరాంశంకర్ తన విధ్యులను బాధ్యతగా నిర్వర్తించే ప్రజలు, ఉన్నతాధికారుల మన్నలను పొందాలన్నారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మాంచారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునిల్‌రెడ్డి, నాయకులు దొడ్డ పుల్లయ్య, తహసీల్దార్ సుధాకర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ సక్రు, సిబ్బంది జ్యోతి, సారయ్య, ఆనంద్‌రాజు, బాస్‌మియా తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్ఐని సన్మానించిన సీపీ


ఏఆర్ ఎస్ఐకి జ్ఞాపిక అందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ ఎండీ గౌస్‌పాషాను సీపీ సునీల్‌దత్ శుక్రవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రిటైర్‌మెంట్ తన వృత్తికే కాని వ్యక్తిత్వానికి కాదని, విధి నిర్వహణలో ఎంతో తోడ్పాటు అందించాలని ఆయన సేవలను కొనియాడారు. కుటుంబసభ్యులతో ఆయన శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. శాఖపరంగా రావాల్సిన బెనిఫిట్లను త్వరలో అందేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, ఏఆర్ ఎస్ఐ సంగయ్య పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు అరికట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్రైవేట్ చిట్ ఫండ్స్, ఫైనాన్స్, వాహన ఫైనాన్స్ కంపెనీల వారు ఇచ్చిన అప్పులను రికవరీ చేసేందుకు అప్పు తీసుకున్న వారిపై దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు న్యాయబద్ధంగా కాకుండా బెదిరింపులకు పాల్పడడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యాన నగర ఏసీపీ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఫైనాన్స్ చిట్‌ఫండ్స్ వారు ఇచ్చిన రుణాలను రికవరీ చేసేందుకు ఇళ్లకు వచ్చి మరీ దాడులు చేస్తున్నారని, ఇక ముందు ఇలానే కొనసాగితే పార్టీ ఆధ్వర్యాన పోరాటాలు చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, శ్రీనివాసరావు, ఎంఏ జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, నాయకులు మీరా సాహెబ్, మండల కార్యదర్శులు భూక్య శ్రీనివాస్, బోడపట్ల సుదర్శన్, బత్తిని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో గుర్తింపు లేని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నారని అన్నారు. ఫీజులు, పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద దోపిడీ చేస్తున్నావిద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఇటువంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శులు మధు, శివ, అయ్యప్ప, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను అనుమతించొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయొద్దని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం డీటీఓ అఫ్రీన్‌సిద్దిక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 648 స్కూల్ బస్సులు ఉండగా.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన బస్సులు కేవలం 45 మాత్రమే ఉన్నాయన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తూ వారి జీవితాలతో చెలగాడం ఆడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్టీఓ నిబంధనలకు విరుద్ధంగా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని స్కూల్ బస్సులు రోడ్డుపై నడుస్తుంటే ఆ వివరాలు తమకు తెలియజేయాలన్నారు. వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు తిప్పరపు లక్ష్మణ్, నాయకులు కరుణ్, స్టాలిన్, వినయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లకు కేఎంసీ అధికారుల ఫైన్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని రెస్టారెంట్ల నుంచి డ్రెయినేజీల్లోకి వ్యర్థాలు రావడంపై కేఎంసీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఎంసీ కమిషనర్ ఆదేశాలతో నగరంలోని రెండు రెస్టారెంట్లకు ఫైన్ విధించారు. కింగ్స్ దర్బార్, రెస్ట్ ఇన్ హోటళ్ల నుంచి ఆహార వ్యర్థాలు డ్రెయినేజీల్లోకి వదిలిపెట్టడాన్ని గుర్తించిన అధికారులు ఆ రెండు హోటళ్లకు ఫైన్ విధించారు. కాగా, ఓ రెస్టారెంట్ నిర్వాహకులు తమ రెస్టారెంట్ పై ఫైన్ వేయకుండా చూడాలని రాజకీయ నాయకులతో కేఎంసీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. దీంతో సదరు రెస్టారెంట్‌కు తక్కువ మొత్తంలో ఫైన్ వేసినట్లు తెలిసింది. దీంతో రాజకీయ పలుకుబడి ఉన్నంతకాలం రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు ఎన్ని తప్పులు చేసినా ఏమి చేయలేమంటూ సిబ్బంది గుసగుసలాడడం గమనార్హం.

5 లోగా యూనిఫాం అందించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బడులు ప్రారంభం రోజునే ఏకరూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య తెలిపారు. ఈనేపథ్యాన మండలంలోని నేలకొండపల్లి, మండ్రాజుపల్లి, బోదులబండ గ్రామాలలో కుట్టు మిషన్ కేంద్రాలను సందర్శించి టైలర్లతో మాట్లాడారు. మండలంలోని 3,208 మంది విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ లోగా ఏకరూప దుస్తులు అందించేందుకు 35 మంది టైలర్లకు కుట్టు పని అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణలో ఎన్‌హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసేంత వరకూ ఏఐటీయూసీ చేసే పోరాడం ఆగదని ఆ సంఘ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 16లో రెండో ఏఎన్‌ఎంలను కూడా చేర్చి వీరిని రెగ్యులర్ చేయాలన్నారు. సమ్మె కాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన 100 శాతం గ్రాస్ శాలరీని వెంటనే అమలు చేయాలని, రోజు పనిచేసే 10 నుంచి 12 గంటల పనిభారాన్ని తగ్గించాలని కోరారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులను ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా భావించబట్టే గత తొమ్మిదేళ్ల కాలంలో 30 సమ్మెలు చేస్తే ఏ సమ్మెకూ సమ్మెకాల జీతం ఇవ్వలేదన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవ చేసిన సిబ్బందిని గుర్తించాలని, ఒకే పనికి జీతంలో భారీ స్థాయిలో వ్యత్యాసాలు ఉండకుండా చూడాలన్నారు. రెండో ఏఎన్ఎం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు మాట్లాడుతూ.. ఏఎన్ఎం శ్రమకు తగిన ఫలితం దక్కేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, సహాయ కార్యదర్శి హేమలత, జిల్లా నాయకురాలు సునీత, నాగమణి, కృష్ణవేణి, రాజేశ్వరి, విజయలక్ష్మి, శైలజ, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.